


# మరో తరం కథ

(పెద్దింటి రామమూర్తి & లక్ష్మణ్)

మగవాడికి ఓ ముప్ఫయేండ్లు పైబడ్డా వివాహం కాకపోతే "ఆయనసలు పెళ్ళి చేసుకోలేదు" అంటూ అదేదో ఘనకార్యమన్నట్లు కారణం తెలుసుకోకుండా ఆకాశానికెత్తేస్తారు. అదే స్త్రీ అయితే "పాపం దీనికింకా పెళ్ళి కాలేదు" అని హేళన చేస్తారు. అందరికీ ఒకటే న్యాయం వుండాలి. స్త్రీ పురుషుడితో ఏ విధంగా తీసిపోయిందేం?"

ఆవేశంగా మాట్లాడుతున్న సరోజను చూసి నవ్వింది వసుంధర.

"నవ్వకు. సీరియస్‌గా చెబుతున్నాను. అసలు నీలాంటి వాళ్ళింకా వుంటబట్టే మగవాళ్ళలా అధికారం చెలాయిస్తున్నారు" రోషంగా అంది సరోజ.

"నీకు కూడా రేపు పెళ్ళయితే ఎవరి మాట ఎవరు వినాల్సివస్తుందో తెలుస్తుంది" నవ్వుతూ పిట్టగోడకేసి చారగిలబడింది వసుంధర.

"అందుకనే కాబోలు పెళ్ళయి సంవత్సరం కాగానే ఓ బిడ్డను యిచ్చేసి ఫారిన్ చెక్కేశాడు మహానుభావుడు. పోనీ బాబును చూచి పోకూడదూ. నీకు నెలలు నిండకముందే ఆయనకా ఫారిన్ ముఖ్యమయింది.

సరోజ మాటలకు వసుంధర మొహం ఒక్కసారి పాలిపోయింది.

"ఈ డిసెంబరులో తప్పకుండా వస్తానని వ్రాశారు సరూ!"

"అలాగేం. ఇది ఎన్నోసారి రావటమో!"

"ఏమైనా ఈసారి వాళ్ళ బాస్‌ను గట్టిగా ఒప్పించి తీర్తానని వ్రాశారు. నాకు కూడా ఆయన వస్తారనే అనిపిస్తోంది."

"వస్తే మంచిదే. కాని ప్రతిమారూ వస్తున్నానని వ్రాయటం. అప్పటినుంచి నువ్వు కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూడటం. తీరా సమయానికి ఏదో అర్జంటు పని వుందంటూ రాకపోవటం...."

వసుంధర కళ్ళలో నీళ్ళు తిరగడం చూసి ఆపేసింది సరోజ.

"సారీ వసూ! తొందరపడ్డాను. నేనందుకే చదువుకొని మన కాళ్ళపై మనం నిలబడాలంటాను. ఇప్పటికైనా మించిపోయింది లేదు."

"వసూ బాబు ఏడుస్తున్నాడు. కాస్త చూడమ్మా." కిందనుంచి అమ్మ పిలవడంతో కళ్ళు తుడుచుకొని కిందకు దిగింది వసుంధర.

సరోజ నిట్టూర్చి వసుంధర ననుసరించింది.

సరోజ, వసుంధర చిన్నప్పటినుంచి కలిసే చదువుకున్నారు. పైగా యిద్దరు వుంటున్న యిళ్ళు పక్కపక్కనే కావటంతో వారిద్దరిమధ్య స్నేహంతోబాటు చనువుకూడా పెరిగింది. స్కూల్ ఫైనల్ కాగానే వసుంధరకు పెళ్ళి నిశ్చయించారు.

తల్లి తండ్రులకెదురుచెప్పలేక ఒప్పేసుకుంది వసుంధర. సరోజ మాత్రం చదువుకొందే పెళ్ళేమిటని వాళ్ళతో పోట్లాడింది. ఆడపిల్ల ఎంత చదివినా ఒక అయ్య చేతిలో పెట్టవల్సిందేకదా అంటూ సరోజ మాటలను ఖండించి, వయసులోని పెద్దరికాన్ని నిలుపుకున్నారు వసుంధర తల్లితండ్రులు.

పెళ్ళయిన సంవత్సరానికల్లా రిసెర్చి చేయాలంటూ వసుంధర భర్త ఫారిన్‌కు అప్లికేషను పెట్టాడు.

అది వెంటనే వచ్చింది.

వసుంధరకు భర్త ఫారిన్ వెళ్ళడం సుతరామూ ఇష్టంలేకపోయింది. పైగా అతను ప్రయాణం పెట్టుకొనేవేళకు తను నిండు నెలల మనిషి.

తనుకూడా ధైర్యంచేసి భర్తతో పోదామంటే అటు మామగారు, ఇటు నాన్నకూడా అడ్డుచెప్పారు.

నాన్న అభ్యంతరానికి కారణం ఆర్థిక అశక్తత. కాన్పు పరాయి దేశంలో ఎలాగ? పైగా మొదటి కాన్పు పుట్టింట్లోనే జరగాలి అని అమ్మ పట్టుదల తనను వెళ్ళనీయలేదు, వెళ్ళేముందు ఆయనెంత మురిపించి మరిపించారని! నువ్వే నా గుండెలనిండా వుంటావని ఏ పని చేస్తున్నా నువ్వే మెదలుతుంటావని కవ్వించారు. ఫారిన్ వెళ్ళగానే అవన్నీ గాలి కెగిరిపోయాయి.

ఎప్పుడో ఒకసారి వస్తానని వ్రాయటం, తిరిగి ఆ వస్తానన్న రోజుకు రాలేనని సాకు చూపి తప్పించుకోవటం.

వసుంధరకు అప్పుడప్పుడు, ఆ దేశంలో మరెవరినైనా ఆయన పెళ్ళి చేసుకున్నారేమోనన్న ఆలోచన వస్తూండేది.

ఆ ఆలోచన వచ్చినంతమాత్రానే వసుంధర వణికిపోయేది. అలా జరగకూడదని ముక్కోటి దేవతలకు మొక్కుకుంటుండేది.

భర్తను గురించి ఆలోచనలో మునిగి వున్న వసుంధరకు సరోజ కుదుపుతో ఒక్కసారి తెలివొచ్చింది.

"ఒసేవ్ నీకో శుభవార్త"

"ఏమిటే అది?" అంది వసుంధర కూడా ఉత్సాహం తెచ్చుకుంటూ.

"మొన్న నన్ను చూసెళ్ళాడుకదూ ఓ ముసలబ్బాయి ఆయనగారికి నేను నచ్చానట."

"నువ్వు మరీను. ఎవరైనా వింటే నిజ

మనుకోగలరు" మందహాసంగా అంది వసుంధర.

"మరి నన్ను పాతికేళ్ళకే ముసల్దాన్ని చేసినపుడు ఆయన ముప్ఫయేళ్ళకు ముసలాడు కాడాయేం?"

"నీ విప్లవధోరణి కాస్త తగ్గించుకో తల్లీ. మీవారు జడుసుకోగలరు! తరువాత నేనేదో నీకు నూరిపోశానని నామీద దండెత్తివచ్చే ప్రమాదముంది."

"నీకలాంటి భయమేమీ అక్కరలేదు. నీలాంటి పవిత్ర భారత నారీమణి నాకు బోధలు చేశావని దేవుడు దిగొచ్చి చెప్పినా నమ్మరులే!"

మరో రెండు మాసాలకల్లా రంగారావుతో సరోజ వివాహం జరిగిపోయింది.

"మళ్ళీ నిన్నెప్పుడు చూస్తానో. ఇన్నాళ్ళు నీ సాంగత్యంలో ఆయన లేనిలోటు కొంత మర్చిపోయాను" అంటూ వసుంధర సరోజ అత్తవారింటికి వెళ్ళిపోతూంటే కళ్ళనీళ్ళు పెట్టుకొంది.

"నా మాట విని ఓ డైవర్స్ నోటీసు పంపు. దాంతో దిగొస్తాడు మనిషి" అక్కసుతో అంది సరోజ.

"చాల్లే. నువ్వూ నీ సలహాలు" అంది వసుంధర పైటచెరగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

సరోజ వెళ్ళిపోయిన తరువాత వసుంధరకు తోచటమంటూ వుంటే అది ఒక్క బాబుతోనే.

సరోజ అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసేది.

సాధారణంగా కొత్తగా పెళ్ళయిన ఆడ


మజాగా, హుషారుగా, కసిగా యవ్వనాన్ని జుర్రుకోండి!

కసిగా దూకవలసి వచ్చినప్పుడు చప్పబడిపోయి ఊరుకుంటారా? మీ కోసం కాసుకున్న యవ్వనాన్ని జుర్రుకోండి. మీరు మాత్రం ఎందుకు వదులుకోవాలి? వేలునొక్కితే చాలు వెండి పూత గల మెరిసే బిళ్ళలు. నేటి టానిక్ రసగుళికలు. కాలం చేజారినా, మీరు బేజారు కాకండి. ఎడతెరిపిలేకుండా, శక్తితో, నిండుగా యవ్వనంతో తులకండి.

శక్తివంతమైన జీవనాని
ఒకాసా

హార్మో-ఫార్మా లిమిటెడ్
లండన్-బెర్లిన్ వారి ఉత్పత్తి

(పురుషుల కోసం వెండి పూత గల బిళ్ళలు)
పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాల్లోనూ దొరుకుతుంది.

OKASA CO. PVT. LTD.
12K Gunbow Street,
P.B.No.396, Bombay-400001



పిల్లలందరూ తన మొహపడింతవాడని, అంతవాడని. తనెంత సుఖపడిపోతున్నదీ వ్రాసుకుంటారు.

సరోజకూడా అలానే వ్రాస్తుందనుకున్న వసుంధర ఉత్తరాలు చదివి తెల్లబోయింది.

సరోజ తనకూ భర్తకు ఎందులో సరిపడందీ తనెలా సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నదీ వ్రాసింది.

"మొండిఘటం" అనుకుంది వసుంధర.

ఇప్పటికైనా పి. యూ. సీ. కి ప్రైవేటుగా కట్టమని వ్రాసింది.

"మళ్ళీ ఈ వయసులో చదువా? చదవాలని ఉద్దేశ్యమూ లేదు ఉత్సాహం కూడా తనకు లేదు" నిస్పృహంగా అనుకుంది. వసుంధర. రోజులు తమపాటికి తాము జరిగిపోసాగాయి.

ఒకనాడు బాబుకు పాలు కలిపియిస్తుంటే సరోజ వాళ్ళింట్లోనుంచి గట్టిగా శోకాలు పెడుతున్న సరోజ తల్లి కనిపించింది. గబగబ పరిగెత్తిందక్కడకు వసుంధర.

సరోజ భర్తకు ఆక్సిడెంటయిందట. వెంటనే రమ్మనమని టెలిగ్రాం. సరోజ పసుపు, కుంకుమలు నిలిచేలా చూడు భగవాన్ అని మొక్కుకుంది వసుంధర. కాని దైవం ఆమె ప్రార్థనను మన్నించలేదు.

మరో పదిరోజులకల్లా కళావిహీనమైన మొఖంతో, తల్లిదండ్రులతో యింటికొచ్చింది సరోజ.

స్నేహితురాల్ని చూసి బావురుమంది వసుంధర. అప్పుడే నీ పసుపు, కుంకుమలు చెరిపేశాడా దేవుడు. అంటూ వలవలా దుఃఖిస్తున్న వసుంధరను సరోజ సముదాయించింది.

"ఎలా జరగాల్సివుంటే అలాగే జరుగుతుంది. ఇప్పుడు ఏం అనుకొని లాభమేముంది చెప్పు. ముందు ఏం చేయాలన్నది ఆలోచించాలింక" అంది.

సరోజ దుఃఖం మాన్పడం ఎవరితరం కాదనీ వసుంధరే స్నేహమాధుర్యంతో కొంత కొంతగా మాన్పగలదనుకున్నారు ఇలా పరిస్థితి తారుమారవటం చూసి నివ్వెరపోయారు.

సరోజ మునుపటిలా తుళ్ళుతూ, నవ్వుతూ మాట్లాడటం మానేసింది. ఆ స్థానానే గంభీరత, నిర్లిప్తత ఆవహించింది.

ఒకనాడు మాటలమధ్యలో వసుంధరతో సరోజ తన అభిప్రాయం వెల్లడి చేసింది.

నేను బియ్యీడికెళ్లా మనుకుంటున్నానే. నే చదివిన బియ్యే ఎందుకూ పనికిరాకుండా వుంది. కనీసం ఇది బియీడీ సీటయినా సంపాదించి పెడుతుందేమో చూడాలి.

స్నేహితురాల్ని విస్మయంగా చూసింది వసుంధర

'ఏం? చదువనీ వయసు దాటిపోయినా ఇంకా కాలేజీమీద మమకారం వదల్లేదనీ నవ్వుతారనా నీ భయం?

నీకేం వయసు మీరిందని?

వెంటనే అనుకుంది సరోజ.

"మరి నేను అదే అనేది. నువ్వు కూడా పి యూ సీ కి ఎందుకు కట్టి పాసవకూడదూ?'

'నా విషయం వదిలేయ్ సరూ. ఆయన్ను గురించిన ఆలోచనల్తో ఈ దిగులుతో నేను చదవలేనసలు.

"నువ్వు పడే బాధలో వెయ్యోవంతు తెలిసినా మీ వారు వెంటనే వచ్చేవారిపాటి" ఆవేదనగా అంది సరోజ.

"ప్లీజ్ సరూ! నన్ను ఒత్తిడి పెట్టకు" వసుంధర వెళ్ళిపోవటంతో సంభాషణ అక్కడి కాగిపోయింది.

చెప్పినట్లే సరోజ బియ్యీడీకి అప్లయి చేసింది సీటు వచ్చిన రోజున ఇంట్లో పెద్ద రభస జరిగింది.

"అసలు ఎవర్నడిగి అప్లయిచేశావు?" తండ్రి మండిపడ్డాడు.

"మీరు పెళ్లిసంబంధాలు చూస్తున్నప్పుడు

నా కేమయినా చెప్పారా? పెండ్లికొడుకును చూడాలన్నప్పుడు మాత్రం చెప్పేవారు. ఇదీ అలాగే, సీటు వచ్చింది చెప్పాను."

"ఎదురు చెప్పటం నేర్చుకున్నావు. ఏం మొహం పెట్టుకొని కాలేజీకి వెళతావు? సిగ్గులేకపోతే సరి"

'నుదుట కుంకుమ లేనంతమాత్రాన సిగ్గుపడవలసిన పనిలేదు." గొంతు గద్గదమయింది సరోజకు.

"ఏమైనా నువ్వు చదవటానికి వీల్లేదు" ఖండితంగా అన్నాడు.

"సరియైన కారణం చెప్పండి. మానేస్తాను" పట్టుదలగా అంది సరోజ.

"నలుగురూ నాల్గు విధాలుగా అనుకుంటారు. ఈ ఊళ్లో భద్రత నీయదు."

"ఇదే కారణమయితే అర్థంలేని పని నన్నాపటం. చదువు కోసం రాజమండ్రి ఎలాగూ వెళ్ళాలి, నన్ను అవహేళన చేయడం కోసం ఇక్కడ వారంతా అక్కడకు రారు. రైలు చార్జీలు కావద్దూ?"

"నీతో వాదించడం నాదే బుద్ధితక్కువ" కండువా దులిపి భుజాన వేసుకొని బయటకు వెళ్ళిపోయారాయన.

"ఆడపిల్లవు. వూరుకాని వూర్లో ఎలా గమ్మా?" తల్లి ప్రాధేయపడింది.

ఇలా ఎంతకాలం మీకు భారంగా వుంటాను చెప్పమ్మా. నాన్నకూడా పెద్దవారయిపోతున్నారు. నాకు కూడా ఏదో వ్యాపకమంటూ వుండాలికదా, అన్నీ ఆలోచించే ఈ నిర్ణయాని కొచ్చానమ్మా."

మరేం మాట్లాడలేకపోయింది తల్లి.

సరోజకు వీడ్కోలు ఇవ్వడానికి వసుంధర స్టేషను కొచ్చింది.

'నిజంగా నీ ధైర్యానికి మెచ్చుకోవాలే. వీళ్ళు ఆ సరోజ పేరు తీసేసి ఏచండికనో, మొండికనో పెట్టవల్సింది.

'భయం లేదులే. కాలేజీలో ఎలాగూ తప్పవు పేర్లు. తొందరెందుకు?" నవ్వింది సరోజ.

"జాగ్రత్తగా వుండు. తొందరపాటు, ఆవేశం తప్ప మరేం తెలియదు నీకు. మాయమాటలకు లొంగిపోకు."

"నీలాగన్న మాట" వెక్కిరించింది సరోజ.


"ఆయన తప్పకుండా వస్తారు. చెప్తే నీకు కోపం వస్తుందిగాని ఆయన ఇంకో నాలుగు నెలల్లో వస్తానని వ్రాశారు" మెల్లగా అంది వసుంధర.

"ఆ వస్తారు. వయసు ఉడిగిపోయిన తర్వాత. అక్కడి వాళ్ళు తరిమేసిన తరువాత. నా మాట విని ఆ మానవుడికి ఓ చురక అంటించు. చెప్తానుగా మనం అన్నిటికీ సిద్ధంగా వుండాలి."

"నా స్థానంలో నువ్వుగాని వుంటే నిజంగా డైవర్స్ ఇచ్చేసి వుండేదానివిలా వుందే."

"ఇప్పుడీస్థితిలోనే పెద్దలు నావల్ల మరిన్ని ఘోరాలు వినవలసి వస్తుందేమోనని నా భయం" రైలు కదులుతూంటే అంది సరోజ.

సరోజ వెళ్ళిపోయిన తర్వాత పిచ్చెత్తి




ఏజెంట్లు : (1) సిటీఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, భావనారాయణ వీథి. విజయవాడ-1 (ఆం.ప్ర). (2) ఫార్మా ట్రేడర్స్ (హైదరాబాద్) కందస్వామి రోడ్. సుల్తాన్ బజార్. హైదరాబాద్ (ఆం.ప్ర.)

నట్లనిపించింది వసుంధరకు. ఒక్కరోజు గడవటానికి యుగం గడచినట్టు అనిపించేది. నెలరోజుల తర్వాత సరోజ దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. ఆతృతగా కవర్ చింపి చదివింది.

డియర్ వసూ!

లెటర్ వ్రాయటానికి ఆలస్యమయింది. క్షమించు. నువ్వెలా వున్నావు? నేను బ్రహ్మాండంగా వున్నాను. ఇక్కడ హృదయ వైశాల్యం గలవారు చాలామంది వున్నారు. ఒకడు నాకు జరిగిన అన్యాయానికి రెండురోజులు దైవాన్ని నిందిస్తూ నిద్రపోలేదట. ఆఖరకు నన్ను పెండ్లి చేసుకోవాలన్న నిశ్చయానికొచ్చాడట, కాశ్మీరు, కొడైకెనాల్ అంతా తిప్పుతాడట. కానీ ఆ హనిమూన్ ముందే జరిగిపోవాలట. ముందు వివాహం కానీయండి అన్నాను. అంతే పాపం! అన్యాయంగా చదువు మానేసి వెళ్ళిపొయ్యాడు.

ఇంకొకడికి రూమ్ దొరకలేదుట. నేను భార్యగానటిస్తే భార్యాభర్తలని చెప్తేఎక్కడైనా ఫామిలీ పోర్షన్ దొరుకుతుందట. "కలసి చదువుకోవచ్చు. ఆ తర్వాత ఒకే చోట ఉద్యోగం చేద్దాం" అన్నాడు.

నటించటమేం ఖర్మ అని విలేశాను.

రాస్కెల్స్! ఆలంబన లేని ఆడదంటే ఎందుకే వీళ్ళకింత అలుసు. ఏమైనా నా చదువు సాఫీగానే సాగిపోతూంది. బాబుకు నా ముద్దులు.

ఉంటా!

నీ సరోజ.

వసుంధరకు కూడా చదువుకుందామని మొదటిమారుగా కోరిక ఉదయించింది. కాలం చాలా అమూల్యమైందని, జ్ఞానం అభివృద్ధి చేసుకోడానికి, దానిని వినియోగించుకోవాలని గ్రహించింది వసుంధర.

వెంటనే సిలబస్, పుస్తకాలు పంపమని సరోజకు వ్రాసింది. వెంటనే సరోజ పుస్తకాలు పంపిస్తూ ఇంతకాలానికైనా స్నేహితురాల్లో మార్పు వచ్చినందుకు అభినందిస్తూ వ్రాసింది.

కూతురు ఎప్పుడూ దిగులుగా వుండటం మాని చదువు మీదకు ధ్యాస మళ్ళించటం చూసి కొంత తేలికపడ్డాయి వసుంధర తల్లితండ్రుల హృదయాలు.

తరువాత సరోజ దగ్గర నుంచి వుత్తరాలు రావటం ఒక్కసారిగా ఆగిపోయాయి. వసుంధర ఎన్ని వుత్తరాలు వ్రాసినా జవాబు రాలేదు.

ఇంటికెళ్ళి కనుక్కుంటే దాని సంగతి నా దగ్గరెత్తొద్దని తన కసలు కూతురేలేదని ఎగిరిపడ్డాడు సరోజ తండ్రి.

వసుంధరకు సంగతి సందర్భం అర్థం కాలేదు. సరోజ మాత్రం ఏదో చేసే వుంటుందని గ్రహించింది.

ఒకనాడు చదువుకుంటూంటే తల్లి రెండు ఉత్తరాలు తెచ్చి ఇచ్చింది.

ఒకటి భర్త దగ్గర నుంచి, మరొకటి సరోజ దగ్గర నుంచి. ముందుగా సరోజ వ్రాసిన ఉత్తరాన్ని ఆతృతగా చదివింది.

డియర్ వసూ,

ఈ ఉత్తరం చదివి నువ్వు ఏ విధంగా అర్థం చేసుకుంటావో తెలియదు. ఇక్కడి వారు మాత్రం బరితెగించినదాన్నని పేరు పెట్టారు.

నేను మళ్ళీ వివాహం చేసుకున్నాను వసూ! ఆశ్చర్యపోతున్నావు కదూ? పెద్దలెవ్వరూ దీనికి అంగీకరించలేదని నీకు వేరుగా వ్రాయనక్కరలేదు. కానీ కాలమే మళ్ళీ అందరినీ కలుపుతుందన్న విశ్వాసం నాకుంది.

ఆయన్ను గురించి వ్రాయలేదు కదూ! ఆయనతో వారి కుటుంబంతో నాకు అతి చిత్రమైన పరిస్థితులలో పరిచయం కలిగింది.

ఒకనాడు నేను మందుల షాపు కెళ్ళినప్పుడు ఒక అమ్మాయి మందు కొనటానికి వచ్చి కొంత డబ్బు తగ్గడం చూసి కొనటం మాని తిరిగి వెళ్ళిపోసాగింది. నాకెందుకో ఆ అమ్మాయిని చూస్తుంటే వయసుకు మించిన భారంతో కుంగిపోతున్నట్లు కనిపించింది. తక్కువైన డబ్బు నేనిస్తానని

మందు పట్టుకెళ్ళమన్నాను. ఆమె కళ్లు ఆనందంతో మెరిశాయి. నన్ను వాళ్ళింటికి తరువాత తీసుకెళ్ళింది.

ఆమె పేరు రాధ. రాధే సంసారాన్ని మోసుకురావాలి. కారణం ఆమె భర్త ఫ్యాక్టరీలో పనిచేస్తూ కళ్ళు పోగొట్టుకున్నాడట. ఆయన్ని నాకు పరిచయం చేసింది.

అతని మొహంలో జీవితంలో పనికి రాకుండా పోయినందుకు నిరాశ, భార్య చేత సంసారాన్ని మోయిస్తున్నందుకు విచారం స్పష్టంగా కనిపించాయి.

వాళ్ళకిద్దరు పిల్లలు.

అలాంటి పరిస్థితులలో హఠాత్తుగా రాధ కన్ను మూసింది.

అలాంటప్పుడు ఆ కుటుంబం ఏం కావాలి? అందుకే అతని కభ్యంతరం లేకపోతే వాళ్ళను నేను పోషిస్తానన్నాను.

కాకుంటే ఆయన్ని పెళ్ళి చేసుకొని ఆ హక్కు సంపాదించుకుంటానన్నాను. ఆయన దీనికి మొదట్లో సుతరామూ ఒప్పుకోలేదు. కాని నేనే బలవంతంచేసి ఒప్పించాను.

నా గురించి అంతా చెప్పాను. పెళ్ళయినా చదువుతానని చెప్పాను. సహృదయంతో అంగీకరించారు.

ఒక్కటిమాత్రం నిజం వసూ! నేను శారీరక సుఖంకోసం పునర్వివాహం చేసుకోలేదు. ఎందుకూ పనికి రాదనుకున్న నా జీవితం మరొక కుటుంబాన్ని దరిచేర్చగలదన్న ధైర్యమే నన్నీపని చేయించింది. మోడువారిన వారి హృదయాల్లో పన్నీటి జల్లు కురిపించగలనన్న విశ్వాసం నాకుంది.

అయితే జాలిపొద్దీ నేని పెళ్ళి చేసుకోలేదు. నాకు నచ్చిన గుణాలన్నీ ఆయనలో వున్నాయి. మనసులు కలవటానికి ఇంతకంటే ఏం కావాలి.

ఇప్పుడు చెప్పు నేనంత చేయరాని పని చేశానా? ఇంకేమీ వ్రాయమంటావు? నీ చదువెంతవరకు వచ్చింది? బాబు బాగున్నాడని తలుస్తాను. ఉత్తరం వ్రాస్తావుగా!

నీ
సరోజ

ఉత్తరం చదివి ఆశ్చర్యపోలేదు వసుంధర. ఇలాంటిదేదో జరిగి వుంటుందని లీలగా ఆమె మనసు ముందే గ్రహించింది. సరోజ ఈ తరంలో పుట్టవలసిన యువతి కాదు ఆమె రాబోయే తరానికి నిదర్శనంగా ఇప్పుడు పుట్టింది. ఒక్కమారు గట్టిగా నిటూర్చి భర్త వ్రాసిన ఉత్తరం తీసింది. మామూలే! అతడికి లీవ్ దొరకలేదుట. అందుకని వచ్చే యత్నాన్ని మరో సంవత్సరానికి వాయిదా వేశాడు. ఉత్తరం చదివి ఎప్పటిలాగే కళ్ళు నీళ్ళు పెట్టుకోలేదు వసుంధర.

తగిలిన చోటనే దెబ్బ తగులుతూంటే బాధకలగటం మాని కొంతకాలానికి ఆభాగం స్పర్శజ్ఞానం కోల్పోతుంది. అంతేఅయింది ఆమె మనసు.

తనకు భర్త వున్నాడు. లోకం దృష్టిలో తను పునిస్త్రీ. కాని నిజానికి తాను గడుపుతున్న జీవితం వైధవ్యంకంటే హీనమైంది. ఇక తన జీవితలక్ష్యం ఒకటే అది బాబుని పెంచి పెదవాడిని చేయటం, భర్తను గూర్చిన ఆలోచనలు పూర్తిగా మానెయ్యటం.

ఆయన వున్నా లేనట్టే అయినపుడు. తెగతెంపులు చేసుకున్నా చేసుకొనకపోయినా ఒక్కటే. చేతిలోని ఉత్తరాన్ని ముక్కలుగా చేసి కిటికీగుండా విసిరేసింది. ఆక్షణంనుంచే వసుంధర ఆలోచనలు నవీనదృక్పథంలోకి పయనించటం ప్రారంభించాయి ★

